క్లుప్తంగా

'జగనన్నకు చెబుదాం' వినతులు పరిష్కరించండి

జలుమూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీవో, తహసీల్దార్ ఐవీ అప్పారావు, బి.సత్యం అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. శాఖల వారీగా వచ్చిన వినతులు పెండింగ్‌లో ఉంచకూడదన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి కె.సురేష్‌కుమార్, పంచాయతీ విస్తరణాధికారి ఉమా మహేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ గోపీకృష్ణ ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత

ఆమదాలవలస రూరల్: విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని కొర్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జమున అన్నారు. గ్రామానికి చెందిన స్వర్గీయ సనపల లక్ష్మునాయుడు జయంతి సందర్భంగా ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో చదివి.. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులకు రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సనపల అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో బోర్ల మరమ్మతులు

ఎల్.ఎన్.పేట: శ్యామలాపురం ఆర్ఆర్ కాలనీలో పాడైన బోర్లకు శుక్రవారం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చారు. బోర్లు పాడైన విషయాన్ని స్థానికులు సర్పంచ్ బలగ లక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. ఆమె సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మెకానిక్‌లు వచ్చి శుక్రవారం బోర్లను బాగుచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ గోవిందరావు పనులను పర్యవేక్షించారు.

ప్రతిఇంటికీ మంచినీటి సరఫరా



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పథకం అమలు చేస్తున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కింతలి గ్రామంలో రూ. 33 లక్షల అంచనాలతో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్, పైపు లైను పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.75 వేల ఖర్చుతో చేతి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, వండాన వెంకట్రావు, కాకర్ల రాజారావు, గాడు నాగరాజు, సింగూరు సూర్యనారాయణ, సింగూరు తేజేశ్వరరావు, గిరి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

నరసన్నపేట: ఉర్లాం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. సాయంత్రం గుణుపూర్ ట్రైన్ కింద తల పెట్టి మృతి చెందినట్లు స్థానికుల సమాచారం. తిలారు నుంచి విశాఖ వెళ్తున్న మార్గంలో మహిళ మృతి చెందారు. అయితే మహిళ వివరాలు తెలియరాలేదు. సాయంత్రం 3 గంటల నుంచి స్టేషన్ వద్దే ఆమె ఉందని స్థానికులు అంటున్నారు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఆమె మృతి చెందినట్లు స్థానికుల సమాచారం. ఈ సంఘటనపై ఆమదాలవలస రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా సంఘటనకు సంబంధించిన సమాచారం రావాల్సి ఉందని అన్నారు.

'నాడు-నేడు' పనులు పరిశీలన

సరుబుజ్జిలి: మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న మనబడి 'నాడు-నేడు' పనులను రాష్ట్ర ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ అధికారి కె.జె.ప్రకాశరావు శుక్రవారం పరిశీలించారు. చినకాగితాపల్లి, గోనెపాడు, రొట్టవలస, కొత్తకోట, పురుషోత్తపురం హైస్కూళ్లు, మూలసవలాపురం, కొండవలస, రొట్టవలస (ఎన్), కొత్తకోట ప్రాథమిక పాఠశాల భవనాల పనులు తనిఖీ చేశారు. పనులకు సంబంధించిన రికార్డులు కూడా ఆడిట్ చేశారు. అనంతరం విద్యాశాఖాధికారులతో సమావేశమై పనుల ప్రగతిపై చర్చించారు. పరిశీలనలో ఎంఈవో-1 డి.బాలరాజు, ఎంఈవో-2 కంచరాన శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ పూర్ణమ్మ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి

కొత్తూరు: ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాల మేరకు పారాపురం-కలిగాం కూడలి మధ్య ఏబీ రోడ్డులో కల్వర్టు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కల్వర్టును తొలగించి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తేవి. సమస్యను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే పైపు కల్వర్టు నిర్మించాలని ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో పనులు ప్రారంభించి శుక్రవారంతో పూర్తి చేశారు.

అర్హులందరికీ ఓటుహక్కు



ఎల్.ఎన్.పేట: తురకపేట సచివాలయంలో బీఎల్‌వోలకు సూచన చేస్తున్న జేసీ నవీన్

- తప్పుల్లేని జాబితా సిద్ధం చేయాలి
- జాయింట్ కలెక్టర్ నవీన్

ఎల్.ఎన్.పేట: వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం నవీన్ అన్నారు. మండలంలోని తురకపేట గ్రామ సచివాలయాలన్ని, డొంకలబడవంజ గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ఓటర్ల జాబితాపై ఆరా తీశారు. ఓటర్ల జాబితాలపై బీఎల్‌వోలు, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి తప్పుల్లేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే క్రమంలో ఆయా ఇంటిలో 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి ఓటు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఓటర్ల జాబితా నుంచి చనిపోయిన వారి ఓట్లు తొలగించాలన్నారు. డోర్ నంబర్ లేకుండా ఉన్న ఓటర్లను గుర్తించి వారి అడ్రాస్ ప్రకారం డోర్ నంబర్ ఇవ్వాలన్నారు. సర్వీసు ఓట్లు సరిచేయటం, వలస ఓటర్లను గుర్తించి వారి ఇష్ట ప్రకారం వారుంటున్న చోటుకు ఓటును బదిలీ చేయటం చేయాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1500 మంది ఓటర్లకు మించిఉంటే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయటం, పేర్లు, వయసు, ఫొటో, ఆధార్, ఫోన్ నెంబర్లు సరిచేయటం ఇంటింటికీ వెళ్లి చేయాలన్నారు. ఆగస్టు 21వ తేదీ నాటికి సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దారు ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, వీఆర్వో జోగినాయుడు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా సర్వే

సారవకోట: ఓటర్ల జాబితా సర్వేను ఇంటింటికీ వెళ్లి పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ హనుమంతరావు బీఎల్‌వోలకు సూచించారు. సారవకోట మండల కేంద్రం, అలుదు గ్రామాల్లో చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ప్రస్తుతమున్న ఓటర్ల జాబితాలో మృతులు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలు తెలుసుకుని తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కర్ని ఓటర్‌గా నమోదు చేయించాలన్నారు. ఆయనతో పాటు వీఆర్వో గౌరమ్మ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన ప్రారంభం

నరసన్నపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్లు జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ఇంటింటి పరిశీలనను బీఎల్‌ఓలు శుక్రవారం ప్రారంభించారు. నరసన్నపేట పట్టణంతో పాటు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేశారు. చనిపోయిన, మైగ్రేషన్ ఓటర్ల వివరాలను సేకరించారు. అలాగే వందేళ్లు పైబడిన ఓటర్లు, డోర్ నంబర్లు లేని, ఒకే డోర్ నంబర్‌పై అధిక సంఖ్యలో ఉన్న ఓటర్లు, సర్వీసు ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. కొత్తగా అర్హులకు దరఖాస్తులు ఇస్తున్నారు. నరసన్నపేట కొత్తవీధి సచివాలయం వన్ పరిధిలో 135వ బూత్ నంబర్‌లో బీఎల్‌ఓ లక్ష్మణరావు పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ తరఫున బూత్ ప్రతినిధిగా పంచాయతీ వార్డు సభ్యుడు బీఎల్ శర్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాతపట్నం: కొరసవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 45వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని జేసీ ఎం.నవీన్‌కుమార్ పరిశీలించారు. మండలంలోని పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల వివరాలను బీఎల్‌వోల యాప్‌లో తమ వివరాలు సవరించుకోవాలని, ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. జాబితలో సవరణలు, మార్పులుంటే చేయించాలన్నారు. కొరసవాడలో ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. తహసీల్దార్ రవిచంద్ర, డీటీలు ప్రసాదరావు, భీమారావు, ఎన్నికల డీటీ శైలజ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



సారవకోటలో సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతరావు



నరసన్నపేట: కొత్తవీధిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న అధికారులు



పాతపట్నం: కొరసవాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్

సంక్షేమ పాలనతో వెలుగులు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో స్పీకర్ తమ్మినేని

ఆమదాలవలస: సంక్షేమ పాలనతో లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మనసున్న మారాజు జగన్ అని కొనియాడారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి మూడోవార్డు ఊసవానిపేట, 21వవార్డు రావికండిపేట గ్రామాల్లో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమాన్ని తెలియజేయడంతోపాటు నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు దుంపల శ్యామలరావు, శిల్లా మల్లికార్జునరావు, కె.శ్యాంప్రసాద్, దుంపల చిరంజీవిరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీను, నాయకులు సాధు చిరంజీవి, కామేశ్వరరావు, రవికాంత్, విజయ్, బొడ్డేపల్లి రవికుమార్, నున్నగాపుల చిన్నారావు, ఎం.రమేష్, కె.రామకృష్ణ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు

మున్సిపాలిటీలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో స్పీకర్ తమ్మినేని సీతారాం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని జోరుగా..హుషారుగా కొనసాగిస్తున్నారు. ఎండ..వాన..చలిని లెక్క చేయకుండా షెడ్యూల్ ప్రకారం ప్రతి ఇంటిని సందర్శిస్తున్నారు. నియోజకవర్గంలో శుక్రవారం 159వ రోజు కార్యక్రమం కొనసాగించారు. నియోజకవర్గానికి సంబంధించి.. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డుల్లో కార్యక్రమాన్ని శుక్రవారంతో పూర్తి చేశారు. సుమారు 13 వేల గడపలను స్పీకర్ సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. మున్సిపాలిటీలో సమస్యలు ఇప్పటికే పరిష్కరించామని, ఇంకా ఉన్న వినతులను త్వరలోనే అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని స్పీకర్ చెప్పారు. చివరి రోజున 21వ వార్డు కుద్దిరాం గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడి సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాలలకు రెండో సెమిస్టర్ పుస్తకాలు

నరసన్నపేట: పాఠశాలల విద్యార్థులందరికీ రెండో సెమిస్టర్ పుస్తకాలు అందాలని ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావులు అన్నారు. మండల కేంద్రం నరసన్నపేట నుంచి పాఠశాలలకు పుస్తకాలను శుక్రవారం సరఫరా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలానికి 13,700 పుస్తకాలు వచ్చాయన్నారు. మండలంలో 83 పాఠశాలలకు ప్రభుత్వం వీటిని సరఫరా చేసిందన్నారు.

సారవకోట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్‌కు సంబంధించిన వాహనాల ద్వారా సరఫరా చేశారు. సెప్టెంబర్ నుంచి రెండో సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యాంశాలు బోధించాల్సి ఉండటంతో ప్రభుత్వం సూచన మేరకు పుస్తకాలను తరలిస్తున్నామని ఎంఈఓ ఎంవీ రమణ తెలిపారు. వీటిని శనివారం నాడు విద్యార్థులకు అందజేసి వారి నుంచి బయోమెట్రిక్ వేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

హిరమండలం: మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందజేసిందని ఎంఈవో-2 షణ్ముఖరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి తొమ్మిది వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు.

బీఎల్‌వోల పనితీరుపై జేసీ అసంతృప్తి



బీఎల్‌వోలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జేసీ నవీన్

కొత్తూరు: కొత్తూరు మండలం బిట్-1, 2 పునరావాస కాలనీలో పనిచేస్తున్న బీఎల్‌వోల పనితీరుపై జేసీ నవీన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయం వద్ద బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సూపర్‌వైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పునరావాస కాలనీలో ఉన్న 218, 219, 220 పోలింగ్ బూత్‌ల పరిధిలో ఉన్న ఓటర్లను సుమారు 30 నుంచి 35 శాతం వరకు తొలగించడంపై జేసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండు కంటే ఎక్కువ శాతం తొలగింపులు ఉండకూడదన్నారు. అటువంటిది ఇంత ఎక్కువ శాతం తొలగింపుపై బీఎల్‌వోలు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంశధార నిర్వాసితులు కావడంతో పలు చోట్ల ఓట్లు ఉండటంతో పాటు ఇతర ప్రాంతాలకు శాశ్వత వలస వెళ్లిపోవడంతో ఓట్లను గ్రామ సభ ఆమోదంతో తొలగించినట్లు బీఎల్‌వోలు జేసీకి వివరణ ఇచ్చారు. తొలగింపులు చేసినప్పుడు పక్కాగా ఫారం-7 ఉండాలన్నారు. బీఎల్‌వోలు దగ్గర ఫారం-7 లేక పోవడంతో వారిపై మండిపడ్డారు. ఓట్లు తొలగింపు చేసినప్పుడు పక్కాగా ఆధారాలు ఉండాలన్నారు. గ్రామంలో ఉన్న ఓట్లు వరుస క్రమములో ఒక బూత్‌లో మాత్రమే ఉండాలన్నారు. తరువాత వరుస నుంచి మరో బూత్‌లో ఉండే విధంగా నమోదు చేయాలని చెప్పారు. కొత్తూరు మండలంలో జిల్లాలోనే ఎక్కువ శాతం ఓట్ల తొలగింపులు ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ తీసుకొవాలని తహసీల్దార్ చక్రవర్తిని ఆదేశించారు. ఒడిశాకు చెందిన కొందరి ఓట్లు సరిహద్దు గ్రామాల్లో ఉన్నందున వాటిని తొలగించాలని పలువురు పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఓటరు నమోదు ప్రక్రియకు పార్టీల నేతలు సహకరించాలని కోరారు. రెండు కాలనీల్లో తొలగింపులపై అభ్యంతరాలు తెలపాలని జేసీ కోరారు. అయితే తొలగించిన ఓటర్లకు కాలనీకి ఎటువంటి సంబంధం లేదని పార్టీ నారకలు జేసీకి స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, తహసీల్దార్ చక్రవర్తి పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలతో రాజుల చెరువు సర్వే



రాజుల చెరువును పరిశీలిస్తున్న డీపీఓ

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేట పరిధిలోని రాజుల చెరువు విస్తీర్ణం, చెరువు ప్రాంతంలో ఆక్రమణలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. డీపీఓ రవికుమార్, పంచాయతీ, రెవెన్యూ అధికారుల సమక్షంలో రాజుల చెరువుపై ఆరా తీశారు. జిల్లాకు చెందిన ఓ న్యాయవాది రాజుల చెరువు ఆక్రమణలకు గురి అవుతుందని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కేసు వేశారు. దీంతో స్థానిక అధికారులు కొన్ని వివరాలు పంపారు. దీనికి సంతృప్తి చెందని గ్రీన్ ట్రిబ్యునల్ మరిన్ని వివరాలు కావాలని ఆదేశించడంతో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా సర్వే చేశారు. చెరువు మొత్తం విస్తీర్ణం, ఆక్రమణల వివరాలు నమోదు చేశారు. పూర్తి వివరాలు త్వరితగతిన అందించాలని ఈఓ సింహాద్రి నాయుడుకు డీపీఓ ఆదేశించారు. దీనిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు డీపీఓ తెలిపారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ప్రత్యేక దృష్టి పెట్టారని డీపీఓ తెలిపారు.

డ్రైవర్‌కు ఆర్థిక సాయం

హిరమండలం: మేజర్ పంచాయితీ హిరమండలం పెద్దకోరాడకు చెందిన రామారావు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఓ భవనం పైనుంచి పడిపోవడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన ఆరోగ్య ఖర్చుల నిమిత్తం ట్రాక్టర్ల ఓనర్లు రూ.14 వేలు, టాటా గ్లూకోజ్ కంపెనీ యాజమాన్యం రూ.5 వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని అతని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని చేరువ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి మరోసారి గెలిపించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. వీఆర్‌గూడెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులకు సంక్షేమ పథకాలు కచ్చితంగా అందాలని, ఉచితంగా సేవలు అందించాలనే ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉన్న ఏకైక సీఎం జగన్ అని కొనయాడారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లన సూర్యారావు, నాయకులు కిల్లి నాగేశ్వరరావు, గాడు నాగరాజు, సువ్వారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాగభూషణరావుకు ఘన నివాళి



ఎల్.ఎన్.పేట: నాగభూషణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్.ఎన్.పేట/కొత్తూరు: విశ్రాంత ప్రిన్సిపల్ కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి స్వర్గీయ రెడ్డి నాగభూషణరావు సేవలు మరువలేనివని ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాధులు, కొత్తూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు అన్నారు. నాగభూషణరావు మూడో వర్ధంతిని ఎల్.ఎన్.పేట, కొత్తూరు మండల కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణరావు చిత్రపటానికి నాయకులు పూలమాలను వేసి నివాళులర్పించారు. పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో ఎంతో కీలక పాత్ర పోషించిన ఆయన లేకపోవటం బాధాకరంగా పేర్కొన్నారు. ఎల్.ఎన్.పేటలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, జేసీఎస్ కన్వీనర్ పెనుమజ్జి విష్ణుమూర్తి, లక్ష్మీనర్సుపేట సర్పంచ్ ముగడ దివాకర్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, ఈగల చిన్నారావు, తలసముద్రం శోభన్‌బాబు, ముగడ జనార్ధన, కొత్తూరులో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు బూర్లె శ్రీనివాసరావు, వంబరవల్లి సూర్యనారాయణ, దూలి అప్పన్న, అండివలస ఆనందరావు, పంకజదాస్, రాజులు నాయుడు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ రాజశేఖర్

హిరమండలం: నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు టెక్కలి డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ వి.ఎ.రాజశేఖర్ అన్నారు. హిరమండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం కార్యాలయ నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో విద్యుత్ సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించారన్నారు. డీలిస్టు, యూడీసీలు రాకుండా చూడాలన్నారు. సకాలంలో రీడింగులు తీయాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలన్నారు. అనంతరం ఈఈ విలేకరులతో మాట్లాడుతూ.. గతంలో కంటే ఇప్పుడు నాణ్యమైన.. అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. 2022-23 ఏడాదిలో 377 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.6,85,893 అపరాధ రుసంగా వసూలు చేశామన్నారు. పాతపట్నం ఏడీ జి.ప్రసాద్‌రావు, ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వరరావు ఉన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ వాన గోపి

జలుమూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేయడం ద్వారా మండలాభివృద్ధి సాధ్యమవుతోందని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత వ్యవసాయశాఖపై చర్చించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతు భరోసా కేంద్రా ద్వారా రైతులకు అందించినట్టు మండల వ్యవసాయాధికారి సురేష్ కుమార్ తెలిపారు. ఉద్యానశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ.. జీడిమామిడి వేసిన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యుడు పట్ట సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులకు గడ్డి విత్తనాలు అందజేస్తున్నామన్నారు. మండల పరిధిలో గతంలో మృతి చెందిన పశువులకు వైఎస్సార్ బీమా కింద నష్టపరిహారం జమైనట్టు పేర్కొన్నారు. గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించామన్నారు.

సమస్యల పరిష్కార వేదిక 'జగనన్న సురక్ష'



ఆమదాలవలస రూరల్: టి.జొన్నవలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న తమ్మినేని శ్రీరామ్మూర్తి



పాతపట్నం ఆల్ఆంధ్ర రోడ్డు సచివాలయంలో సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం సమస్యల పరిష్కార వేదికగా నిలుస్తోంది. 11 సేవలను ఉచితంగా అందిస్తుండడంతో లబ్ధిదారులు దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం 'జగనన్న సురక్ష' సభలను నిర్వహించి దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సంక్షిప్తంగా..

జూదరుల అరెస్టు

పాతపట్నం: రంకిణీ గ్రామ సమీపంలోని మామిడితోటలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై మహమ్మద్ ఆసీన్ శుక్రవారం తెలిపారు. కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారంతా పాతపట్నానికి చెందినవారన్నారు. వారివద్ద నుంచి 8,220 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

డప్పు కళాకారులను ఆదుకోవాలి

కొత్తూరు: డప్పు కళాకారులను ఆదుకోవాలని దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.గణేష్ కోరారు. ఈ నెల 25, 26 తేదీల్లో పాతపట్నంలో నిర్వహించనున్న అధ్యాయన తరగతుల కరపత్రాలను గూనభద్రలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సంఘం ప్రతినిధులు ప్రకాశరావు, శంకర్, పాపారావు, అప్పారావు, గురుమూర్తి, లక్ష్మీనారాయణ, సాంబమూర్తి పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

కొత్తూరు: అవనిగెడ్డలో న్యాయవాది శ్రీనివాసరావుపై కొందరు దాడి చేయడం హేయమైన చర్యని కొత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అప్పారావు, సుధాకరావు అన్నారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా శుక్రవారం కొత్తూరు కోర్టు ఎదుట న్యాయవాదులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.ఉమామహేశ్వరరావు, శ్రీరామదూత, ఫాల్గుణరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఎనిమిది మంది ఉపాధ్యాయులను శుక్రవారం గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. హెచ్ఎం గొర్లె తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక దుర్గాప్రసాదరావుతో పాటు మిగిలిన వారిని దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్.ఎన్.పేట: బొర్రంపేట ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు సంబంధిత ఏఈ వి.ఎ.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రావిచెంద్రి, పూశాం, చొర్లంగి, బొత్తాడసింగి, జాడుపేట, బిడ్డికపేట తదితర గ్రామాల పరిధితో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్లు సరిచేస్తున్నందున ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపి వేస్తున్నామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

23న రేషన్ డీలర్ల మహాసభ

ఆమదాలవలస: ఈ నెల 23వ తేదీన విజయవాడలోని సింగినగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర రేషన్ డీలర్ల మహాసభను విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బొడ్డేపల్లి రవికుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో డీలర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు కోరారు. కడుము, కురిగాం, బలద, కౌశల్యాపురం పాఠశాలను బృందం సభ్యులు శుక్రవారం సందర్శించారు. గత పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు బోద శ్రీనివాసరావు, విజయకుమార్, క్రాంతికుమార్, సంతోష్‌కుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

కొత్తూరు: కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల నుంచి స్థానిక నాలుగు రోడ్లు కూడలి వరకూ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరీష్ మాట్లాడుతూ.. కళాశాలలో మంచినీరు, మరుగుదొడ్ల సమస్య పరిష్కరించాలని, అర్థశాస్త్రం అధ్యాపకుడిని నియమించాలని కోరారు.